అక్రమ నియామకంపై విచారణ

రాయపర్తి, మార్చి 11: మండలంలోని గట్టికల్ గ్రామంలో ఆశ వర్కర్ అక్రమ నియామకంపై మంగళవారం మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో వర్ధన్నపేట ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ రామ్మూర్తి విచారణ జరిపారు. గట్టికల్‌కు చెందిన ఆశ వర్కర్ బెల్లంకొండ యాదమ్మ మృతి చెందగా, ఆమె స్థానంలో సుకన్యను సీహెచ్‌వో జ్ఞానసుందరి అక్రమ మార్గంలో నియమించారు. ఈ మేరకు జరిగిన అక్రమాలపై గ్రామానికి చెందిన దాసరి సువర్ణ వరంగల్ కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రామ్మూర్తి విచారణ జరిపారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని ఆయన తెలిపారు.

మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

కాశీబుగ్గ, మార్చి 11: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీకి మూడు రోజులు సెలవు ఇస్తున్నట్లు కార్యదర్శి జి.రెడ్యా తెలిపారు. ఈ నెల 14న హోలీ పండుగ, 15న దులండి పండుగ, వారాంతపు యార్డు బంద్, 16న వారాంతపు సెలవు అని తెలిపారు. సోమవారం నుంచి మార్కెట్‌లో క్రయవిక్రయాలు యథావిధిగా జరగనున్నట్లు వెల్లడించారు.

శిక్షణను వినియోగించుకోవాలి

పర్వతగిరి, మార్చి 11: మండలంలోని మహిళలు, విద్యార్థులకు వేసవి సెలవుల్లో ఆర్‌డీఎఫ్ వనిత అచ్యుతపాయి విద్యాలయ జూనియర్ కళాశాలలో కంప్యూటర్‌పై అవగాహన, టాలీలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్డీఎఫ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆడెపు జనార్దన్ తెలిపారు. ఈ నెల 20 నుంచి 45 రోజులపాటు శిక్షణ ఉంటుందని, నిత్యం రెండు గంటల సమయం కేటాయించాలని కోరారు. వివరాలకు 9490379775, 9494921759 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జాతరలో ఏర్పాట్ల పరిశీలన

గీసుగొండ, మార్చి 11: కొమ్మాల జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ తెలిపారు. కొమ్మాలలో చేపట్టిన ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు.

పొగాకు ఉత్పత్తుల పట్టివేత

వరంగల్‌చౌరస్తా, మార్చి 11: నగరంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి రూ. 86,450 విలువైన గుట్కాలను పట్టుకున్నారు. పిన్నవారివీధిలో రవ్వ వరప్రసాద్ వద్ద రూ. 46,300, గిర్మాజీపేటలో కొతాడియా ఆరిఫ్ నుంచి రూ. రూ. 40,150 విలువైన 11 రకాల పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు.

ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ! నా క్లయింట్ అయిన కటంగూరి దివ్య, భర్త : కటంగూరి సుభాష్ చందర్, కొడవటంచ వాస్తవ్యులు ; కొరిశెట్టి వనమ, భర్త : కె. రమణారావు, విజయపాల్ కాలనీ గారు, క్రింది షెడ్యూల్‌లో పేర్కొనిన ఆస్తిని అమ్మదలచగా, నా క్లయింట్ కొనుగోలుచేయుటకు ఆసక్తి చూపి, అందునిమిత్తం కొంత నగదును పై అమ్మకం దారుకు చెల్లించి, కోనుగోలు ఒప్పందం చేసుకున్నారు. ఈ ఆస్తి కోనుగోలు వ్యవహారంపై ఎవ్వరికైనా అభ్యంతరం ఉన్నట్లయితే, ఈరోజు నుండి వారం రోజులలోపు, క్రింది అడ్రస్ దారుకు తగిన ఆధారాలతో సంప్రదించగలరు. లేనట్లయితే తదుపరి వచ్చే ఆక్షేపణలు పరిగణ లోకి తీసుకోవడం జరుగదని, అట్టి ఆస్తిని, నా క్లయింట్ పేరున గానీ, ఆమె తరుపు నామినీపై గానీ రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరుగుతుందని ఇందుమూలంగా తెలియ చేస్తున్నాం.

షెడ్యూల్ ఆస్తి వివరాలు

ఇంటి నెంబర్ 1-7-44/2/A, ప్లాట్ నెం.34 లోగలిది విస్తీర్ణం 300.00 చదరపుటడుగులు, సర్వే నెం.495, 506,509 మరియు 510 వడ్డెపల్లి రెవెన్యూ పరిధి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల, హన్మకొండ జిల్లాలోని క్రింది హద్దులు ఆస్తి : తూర్పు : 30 ఫీట్ల రోడ్ ; పడమర : ప్లాట్ నెం. 33 ; ఉత్తరం : 30 ఫీట్ల రోడ్ ; దక్షిణం : ప్లాట్ నెం. 35

తేది: 12-03-2025

Sd/- BHEEMANATH PURNA CHANDRA MOHAN
M.Com, LL.B, M.A.(Psy)
Advocate
H.No: 25-4-481/1, Vishnupuri, Kazipet,Hanumakonda.
Pin Code: 506 003, Cell.No: 9849643839

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★OT-TECHNICIANS (Exp.), PHARMACY (Exp.), LAB-TECHNICIANS (Exp.), DHOBI Worker & Computer Operators. Cont: Guardian Hospital, Mulugu 'X' Road, Wgl. 12 to 2 pm.
NTW-488

CHANGE OF NAME

★I, THOUTAM BHAGYA LAXMI, W/o. THOUTAM RAMBABU, R/o. 2-10-206, Kummari Wada, Near Pingili College, Waddepally, Hanumakonda-Dist T.S., have Changed my name from BHAGYALAKSHMI TATIPAMULA to BHAGYA LAXMI THOUTAM for all purposes.
NTW-6568

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

విద్యార్థిని అభినందిస్తున్న కోడం శ్రీధర్

జిల్లాస్థాయి చెస్ పోటీల్లో బహుమతి

కరీమాబాద్, మార్చి 11: ఇటీవల నిర్వహించిన యునైటెడ్ డిస్ట్రిక్ట్ ఓపెన్ టు ఆల్ చెస్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో న్యూక్లియస్ సెయింట్ ఆమెన్ పాఠశాల విద్యార్థి విశ్వజిత్ ద్వితీయ స్థానం సాధించినట్లు కరస్పాండెంట్ కోడం శ్రీధర్ తెలిపారు. కరీమాబాద్‌లోని పాఠశాలలో మంగళవారం విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోడం సబిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ప్రణాళిక ఖరారు

ఖిలావరంగల్, మార్చి 11: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి పనుల ప్రణాళికను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిద్ధం చేసింది. జిల్లాలోని 11 మండలాల పరిధిలో రూ. 151,91,03,000 నిధులతో కూడిన 30,38,206 లక్షల పని దినాలను కల్పించేలా కార్యాచరణ రూపొందించారు. జిల్లాలో ప్రస్తుతం 1,20,059 జాబ్‌కార్డులు ఉన్నాయి. చెన్నరావుపేటకు 2,22,894, దుగ్గొండి 3,74,875, గీసుగొండకు 1,40,700, ఖానాపురం 2,25,570, నల్లబెల్లి 2,90,462, నర్సంపేటకు 3,31,017, నెక్కొండకు 3,20,791, పర్వతగిరి 2,70,145, రాయపర్తి 3,87,671, సంగెం 2,73,705, వర్ధన్నపేట మండలానికి 2,00,376 పని దినాలు కల్పించినట్లు డీఆర్డీఏ కౌసల్యాదేవి తెలిపారు. రోజూ రూ. 300 వరకు కూలి ఉంటుందని పేర్కొన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట

నెక్కొండ/దుగ్గొండి, మార్చి 11: మండలంలోని సూరిపల్లిలో ట్రాన్స్‌కో ఆపరేషన్స్ ఏడీఈ శ్రీధర్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం పొలంబాట నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ రైతులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తెలియజేసేందుకు పొలంబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు స్విచ్ బోర్డులు, మోటర్ స్టార్టర్లు నిర్దేశిత ప్రమాణాలు కలిగినవే వినియోగించుకోవాలని సూచించారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అలాగే, దుగ్గొండి ఏఈ ప్రత్యూష ఆధ్వర్యంలో గిర్నిబావి సబ్‌స్టేషన్ పరిధిలోని పొనకల్‌లో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. రైతుల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరు మృతి

నల్లబెల్లి, మార్చి 11: వేర్వేరు కారణాలతో ఇద్దరు మృతి చెందిన ఘటన మండలంలో జరిగింది. మండలంలోని నారక్కపేటకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ తుపాకుల ప్రసాద్(58) సోమవారం పురుగుల మందు తాగగా, ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అలాగే, ఇదే గ్రామానికి చెందిన మాడుగుల అజయ్(23) తన మిత్రుడు జన్ను అజయ్‌తో కలిసి బైక్‌పై వెళ్తుండగా 365 జాతీయ రహదారిపై బజ్జుతండా వద్ద కారు ఢీకొట్టింది. దీంతో మాడుగుల అజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన జన్ను అజయ్‌తోపాటు కారు డ్రైవర్‌ను దవాఖానకు తరలించారు. ఎస్సై గోవర్ధన్ దర్యాప్తు చేపట్టారు. మృతుల కుటుంబాలను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి నాయకులతో లిసి పరామర్శించారు.

'పెండింగ్ బిల్లులు చెల్లించాలి'

దుగ్గొండి, మార్చి 11: గ్రామాల అభివృద్ధి కోసం చేసిన పనుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో శాసన మండలి డిప్యూటీ స్పీకర్ బండా ప్రకాశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

గంటపాటు నిలిచిన కాంటాలు

కాశీబుగ్గ, మార్చి 11: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని అపరాల యార్డులో మంగళవారం గంటపాటు కాంటాలు నిలిచిపోయాయి. కొందరు చిల్లర కొనుగోళ్లు చేసేందుకు అపరాల యార్డులో వచ్చారు. దీంతో వ్యాపారులు శ్రీనివాస్‌తోపాటు మరో ఇద్దరు చిల్లర కొనుగోళ్లు జరపొద్దని గంటపాటు కాంటాలను నిలిపివేశారు. అనంతరం అధికారులు చిల్లర కొనుగోలు చేసే వారిని అక్కడి నుంచి పంపించారు.

ప్లాస్టిక్ నివారణ మనందరి బాధ్యత

కరీమాబాద్, మార్చి 11: ప్లాస్టిక్ నివారణ మనందరి బాధ్యత అని జీడబ్ల్యూఎంసీ ఎంహెచ్‌వో రాజేశ్ అన్నారు. అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు డివిజన్లలో మంగళవారం ఆయన పారిశుధ్య పనులు ప్రారంభించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కాలనీలను శుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భాస్కర్, ఇన్‌స్పెక్టర్ శ్రీను, జవాన్లు జీవన్, కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, 32వ డివిజన్‌లో కార్పొరేటర్ పల్లం పద్మ పారిశుధ్య పనులను పరిశీలించారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

వరంగల్, మార్చి 11: కరీంనగర్ లోయర్ మానేరు డ్యామ్‌లో వార్షిక నిర్వహణ పనుల్లో భాగంగా బుధవారం అండర్ రైల్వేగేట్ జోన్ పరిధిలో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎస్ఈ ప్రవీణ్ చంద్ర తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తాగునీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. మడికొండ, కడిపికొండ, భట్టుపల్లి, మామునూరు ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

నిబంధనల మేరకే దుకాణాలు నిర్వహించాలి

రాయపర్తి, మార్చి 11: ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాల నిర్వాహకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రాష్ట్ర వ్యవసాయ శాఖ రూపొందించిన నియమాల మేరకే దుకాణాలు నిర్వహించాలని డీఏవో కె.అనురాధ సూచించారు. మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఏవో గుమ్మడి వీరభద్రం అధ్యక్షతన సీడ్స్, ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణాలతో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. డీలర్లందరూ పెండింగ్ లేకుండా ఈ-పాస్ మిషన్లలో స్టాక్ క్లియర్ చేయాలని, అక్నాలెడ్జ్‌మెంట్ పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. అన్ని వివరాలు ఆన్‌లైన్ చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలు, నిబంధనల మేరకే విక్రయాలు చేయాలన్నారు. నిబంధనలు పాటించని దుకాణాలు, డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సదస్సులో ఏఈవోలు రాజేశ్, సాయిప్రసాద్, మనస్విని, కావ్య, క్రాంతికుమార్, దుకాణాదారులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న డీఏవో కె.అనురాధ

పెరిగిపోతున్న అధికార పార్టీ అరాచకాలు

- కాంగ్రెస్ నాయకులకు అండగా నిలుస్తున్న పోలీసులు
- కలెక్టర్, సీపీ, డీసీపీలు ప్రత్యేకంగా సమీక్షించాలి
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, మార్చి 11: నర్సంపేట నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుల అరాచకాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, వారికి పోలీసులు అండగా నిలుస్తున్నారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పెద్ది మాట్లాడారు. డివిజన్‌లోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి నిలిచిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. శాంతిభద్రతలను కాపాడడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. కలెక్టర్, వరంగల్ సీపీ, డీసీపీలు వెంటనే స్పందించి నర్సంపేటలో జరుగుతున్న అరాచకాలపై ప్రత్యేకంగా సమీక్షించాలని డిమాండ్ చేశారు. నర్సంపేట నియోజకవర్గంలో 15 నెలలుగా అధికార పార్టీ నాయకులు చేస్తున్న అరాచకాలు, భూ కబ్జాలు, దాడులపై అధికారులు, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రెచ్చిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారికి నర్సంపేట సీఐ అండగా నిలవడంతో కాంగ్రెస్ నేతల ఆగడాలకు హద్దు లేకుండా పోయిందన్నారు. నర్సంపేట పోలీసుల తీరుపై గతంలో వరంగల్ సీపీకి లేఖలు రాసిన విషయాన్ని ఈ సందర్భంగా పెద్ది గుర్తు చేశారు. అయినా ఎలాంటి మార్పు లేకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ నేతలు నర్సంపేటలో ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలపై కన్నేసి సామాన్యులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు, రెవెన్యూ, మున్సిపాలిటీ యంత్రాంగం అధికార పార్టీ నాయకులకు అండగా నిలుస్తుండడంతో వారి ఆగడాలు మితిమీరిపోతున్నాయని ధ్వజమెత్తారు. గత పదేళ్లలో అభివృద్ధి, సంక్షేమం, శాంతికి నిలయంగా ఉన్న నర్సంపేట నియోజకవర్గం నేడు అశాంతి, అల్లర్లు, అరాచకాల వైపు అడుగులు వేయడం దురదృష్టకరమన్నారు.

రాస్తారోకో నిర్వహిస్తున్న వెంచర్ యజమానులు

దొంతి అనుచరుల ఆగడాలను అరికట్టాలి

- వెంచర్లకు డబ్బులు డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్ నేతలు
- భూ యజమానుల రాస్తారోకో

నర్సంపేట, మార్చి 11: నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అనుచరుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని, నెక్కొండ ప్రధాన రహదారిలోని వెంచర్ రోడ్డును ధ్వంసం చేసిన టీపీసీసీ మెంబర్ పెండెం రామానంద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్‌ను వెంటనే అరెస్టు చేయాలని భూ యజమానులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, చెల్పూరి శ్రీనివాస్, మునిగాల నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే అనుచరులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని నర్సంపేట-నెక్కొండ ప్రధాన రహదారిపై భూ యజమానులు, వారి బంధువులు ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా భూ యజమానులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, చెల్పూరి శ్రీనివాస్, మునిగాల నర్సింహారెడ్డి మాట్లాడుతూ నెక్కొండ రోడ్డులోని సర్వే నంబర్ 670, 671, 672, 673లో పట్టా భూమిని కొనుగోలు చేసి డీటీసీపీ లే అవుట్ చేసుకున్నామన్నారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ప్రభుత్వం నుంచి ఎల్ఆర్ఎస్ తీసుకున్నట్లు చెప్పారు. ఈ రెండు లే అవుట్లకు నెక్కొండ ప్రధాన రహదారి నుంచి రోడ్డు నిర్మించినట్లు చెప్పారు. వెంచర్ నిర్మాణ సమయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపించారు. నిరాకరించడంతో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే టీపీసీసీ మెంబర్ పెండెం రామానంద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ మళ్లీ డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్నారు. ఇవ్వకపోవడంతో రాత్రికి రాత్రే వెంచర్ రోడ్డును తవ్వారన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రాస్తారోకోను విరమింపజేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్, ఆర్డీవోకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రామగిరి సురేందర్, రాజేశ్, బూడిద శ్రీనివాస్, ముంజాల శ్రీనివాస్, దేవేందర్‌రావు, సాంబరెడ్డితోపాటు 30 మంది ప్లాట్ల కొనుగోలుదారులు పాల్గొన్నారు.

సాగు, తాగునీటి సరఫరాకే ప్రాధాన్యం ఇవ్వాలి

- సమస్యలు ఉత్పన్నమైతే చర్యలు
- కలెక్టర్ సత్యశారద

రిజర్వాయర్ వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ సత్యశారద

రాయపర్తి, మార్చి 11: మండలంలోని అన్ని గ్రామాల్లో సాగు, తాగునీటి సరఫరాకే అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. మంగళవారం డీఏవో అనురాధ, ఇరిగేషన్ శాఖ ఈఈ రమేశ్‌బాబు, తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, ఎంపీడీవో గుగులోత్ కిషన్‌నాయక్, ఎస్సారెస్పీ డీఈ కిరణ్‌కుమార్, ఏవో గుమ్మడి వీరభద్రంతో కలిసి ఆమె మైలారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను సందర్శించారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వ, ఎస్సారెస్పీ ప్రధాన కాల్వల ద్వారా సరఫరా అవుతున్న నీటి వివరాలు, అవుట్ ఫ్లో గేట్లతో దిగువకు వదులుతున్న జలాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని మైలారం, ఊకల్, గట్టికల్, మహబూబ్‌నగర్, జగన్నాథపల్లి, పానీష్‌తండాలోని వ్యవసాయ క్షేత్రాల్లో పర్యటించి వరి, మక్కజొన్న, ఆరుతడి పంటలను పరిశీలించారు. మహబూబ్‌నగర్ గ్రామస్తులతో మాట్లాడిన ఆమె గ్రామంలో తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. యాసంగి పంటలను రైతులు విజయవంతంగా ఇంటికి చేర్చినప్పుడే అధికారులు పూర్తిస్థాయిలో విధులు నిర్వర్తించినట్లు భావించాలని సూచించారు. కార్యక్రమంలో గిర్దావర్ చంద్రమోహన్, ఎంపీవో కూచన ప్రకాశ్, ఇరిగేషన్ శాఖ ఏఈలు బానోత్ మల్సూర్‌నాయక్, నందకిశోర్, బాలదాసు, ఏఈవోలు కడుదూరి రాజేశ్, క్రాంతికుమార్, కార్యదర్శి కే పవన్‌సాగర్ పాల్గొన్నారు.

రైతులు లాభాలు ఆర్జించేలా చూడాలి

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ జ్ఞానప్రకాశ్

కరీమాబాద్, మార్చి 11: రైతులను వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల్లో ప్రోత్సహించి వారు లాభాలు ఆర్జించేలా చూడాలని పీవీ నరసింహారావు తెలంగాణ రాష్ట్ర పశువైద్య విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ జ్ఞాన ప్రకాశ్ అధికారులకు సూచించారు. మామునూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం శాస్త్రీయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. రైతులకు సలహాలు, సూచనలు అందజేస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటు నందించాలన్నారు. అనంతరం రైతులకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి డాక్టర్ కిషన్‌కుమార్, అటారి ప్రతినిధి డాక్టర్ ఏఆర్‌రెడ్డి, జిల్లా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఉమారెడ్డి, ఏరువాక ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ దిలీప్‌కుమార్, ప్రాంతీయ పశు శిక్షణ కేంద్రం అధికారి డాక్టర్ బాలాజీ, లీడ్ బ్యాంక్ మేనేజర్ హవేలీ రీజు, జిల్లా మత్స్యశాక అధికారి నాగమణి, ఉద్యాన శాఖ అధికారి డాక్టర్ సంగీతలక్ష్మి, ప్రాంతీయ పశు పరిశోధనా స్థానం డాక్టర్ అమ్రేశ్వరి, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

కోనారెడ్డి చెరువు హద్దులు నిర్ణయించాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నేతలు

వర్ధన్నపేట, మార్చి 11: కోనారెడ్డి చెరువు శిఖం ఆక్రమణపై విచారణ చేపట్టి హద్దులు నిర్ణయించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, పట్టణ అధ్యక్షుడు గోధుల మధుసూదన్ డిమాండ్ చేశారు. మంగళవారం నాయకులతో కలిసి వారు తహసీల్దార్ విజయ్‌సాగర్‌కు వినతిపత్రం అందజజేశారు. వర్ధన్నపేట మండలంలోని కోనారెడ్డి చెరువు ఆక్రమణకు గురైందని సోమవారం బీఆర్ఎస్ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఎండార్స్ చేసి తహసీల్దార్, ఇరిగేషన్ ఏఈకి పంపించడంతో ఈ కాపీని మంగళవారం తహసీల్దార్‌కు బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. శిఖం భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి అజీం, తోటకూరి శ్రీధర్, మాజీ ఎంపీటీసీ నునవత్ వసంత్, ఉపాధ్యక్షుడు భూక్యా రామన్న, కోశాధికారి ఎండీ సోయల్, అనిల్, కొండేటి సుధాకర్, యూత్ అధ్యక్షుడు సురేశ్, అయిత ఎల్లయ్య, గుడికందుల నరసయ్య, కొండేటి భాస్కర్, శ్రీనాథ్‌రావు, శ్రీను పాల్గొన్నారు.

వంట గ్యాస్ పైసలు పడ్తలేవు

పరకాల ఎమ్మెల్యే రేవూరిని ప్రశ్నించిన మహిళలు

సంగెం/గీసుగొండ, మార్చి 11: తమకు వంటగ్యాస్ పైసలు పడ్తలేవని, ఎన్నిసార్లు దరఖాస్తు ఇచ్చినా లాభం లేదని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మహిళలు ప్రశ్నించారు. మంగళవారం ఆయన సంగెం, ఖిలావరంగల్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసేందుకు వచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు, గ్యాస్ పథకం అమలు చేస్తున్నదని చెప్పడంతో మహిళలు నిల్చొని తమకు గ్యాస్ డబ్బులు రావడం లేదని తెలిపారు. దీంతో ఏమైనా టెక్నికల్ ఇబ్బందులు ఉంటే ఎంపీడీవో కార్యాలయంలో కలవాలని తెలిపారు. అలాగే, డబ్బులు ఎందుకు పడడం లేదని అక్కడే ఉన్న ఎంపీడీవో రవీందర్‌ను అడిగితే.. ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామన్నారు. బకాయిలు ఒకేసారి పడతాయని ఎమ్మెల్యే సర్దిచెప్పడం కొసమెరుపు. కాగా, ప్రభుత్వ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు స్టేజీపై కూర్చుంటున్నారని చర్చించుకోవడం కనిపించింది. అలాగే, గీసుగొండ మండలంతోపాటు గ్రేటర్ వరంగల్ 15, 16వ డివిజన్లకు చెందిన పలువురు లబ్ధిదారులకు రేవూరి కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.

హెల్ప్‌డెస్క్ వద్ద క్యూలో ఉన్న దరఖాస్తుదారులు

బల్దియాలో ఎల్ ఆర్ఎస్ జాతర

- హెల్ప్‌డెస్క్‌ల వద్ద బారులు
- అవగాహన లోపంతో దరఖాస్తుదారుల ఇబ్బందులు
- శాఖల వద్ద పేరుకుపోతున్న దరఖాస్తులు

వరంగల్, మార్చి 11: వరంగల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఎల్ ఆర్ఎస్ జాతర కొనసాగుతున్నది. నాలుగు నెలలుగా వెలవెలబోయిన హెల్ప్‌డెస్క్ వద్ద దరఖాస్తుదారులు సందడి చేస్తున్నారు. మార్చి 31 లోగా ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తి చేసుకొని ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ కల్పించిన నేపథ్యంలో దరఖాస్తుదారులు ఆసక్తి చూపుతున్నారు. ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు వారం రోజులుగా కార్పొరేషన్ ప్రధాన కార్యాలయానికి క్యూ కడుతున్నారు. హెల్ప్‌డెస్క్ వద్ద గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. అయితే, హెల్ప్‌డెస్క్‌ల్లో ఎల్ఆర్ఎస్‌పై సరైన అవగాహన లేని సిబ్బందిని ఉంచడంతో గందరగోళంగా మారింది. నిత్యం సిబ్బందికి, దరఖాస్తుదారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంటున్నది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు మూడు శాఖల అధికారులను ఒకేచోటకు చేర్చారు. మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో ఒకేచోట పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 25 వేల దరఖాస్తులను మున్సిపల్ అధికారులు క్లియర్ చేయగా, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. రెవెన్యూ అధికారుల వద్ద 20 వేలు, ఇరిగేషన్ అధికారుల వద్ద 22 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 3 శాఖల అధికారులు క్